ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రయివేటు విద్యార్థులకు హాజరు నుంచి మినహాయింపునకు సంబంధించిన ఫీజు చెల్లింపుకు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువును ఈ నెల 8 నుంచి 12కు పొడిగించారు. హాజరు మినహాయింపు ఫీజు రూ.500 కాగా, అపరాధ రుసుంను రూ.500గా నిర్ణయించారు.

కాంగ్రెస్ హత్యా రాజకీయాలను సహించం : కెటిఆర్

- ఓటమి భయంతోనే భౌతికదాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో కాంగ్రెస్ హత్యా రాజకీయాలను సహించేది లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులకు పాల్పడుతున్నదని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బిఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ హత్య అత్యంత హేయమైన చర్య అని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. అధికారమదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న అరాచకాలను బిఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని హెచ్చరించారు. లింగంపల్లి గ్రామంలో సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో బిఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనలో ఉప్పుల మల్లయ్య మరణించగా, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్‌తోపాటు మరో 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని కోరారు. ఈ దాడి ఘటన, ఉప్పుల మల్లయ్య మరణవార్త తెలియగానే మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌లతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను ఆరా తెలుసుకున్నామని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కోరారు.

పిల్లల్లో ప్రకటనలపై అక్షరాస్యత పెంచుతాం : ఎఎస్‌సిఐ

హైదరాబాద్ : పది లక్షల మంది పిల్లల్లో ప్రకటనల అక్షరాస్యతను పెంపొందించే లక్ష్యంతో యాడ్‌వైజ్ అనే పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) తెలిపింది. 2026 చివరి నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎఎస్‌సిఐ సిఇఒ, సెక్రటరీ జనరల్ మనీషా కపూర్ పేర్కొన్నారు. మూడు నుండి ఎనిమిది తరగతుల పిల్లలలో ప్రకటనల అక్షరాస్యతను మెరుగు పరచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విధంగా పిల్లలను శక్తివంతం చేయడం బాధ్యతాయుతమైన మీడియా వినియోగాన్ని పెంపొందిస్తుందన్నారు.

రాజకీయ స్వలాభం కోసమే జిహెచ్ఎంసి విస్తరణ

- బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలు కాకుండా రాజకీయ స్వలాభం కోసమే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)ని విస్తరించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తెలిపారు. అందుకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో 20 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లు, కీలక గ్రామ పంచాయతీలను కలిపేసిందని చెప్పారు. దీంతో జిహెచ్ఎంసి విస్తీర్ణం దాదాపు 2000 చదరపు కిలోమీటర్లకు పెరిగిందని చెప్పారు. మొత్తంగా 300 వార్డులుగా పునర్విభజన చేయనుందని తెలిపారు. గ్రేటర్‌లో అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితులు ఉన్నాయనీ, సివరేజ్ సిస్టమ్, మౌలిక వసతులు కూడా కల్పించలేదని విమర్శించారు. హిల్ట్ పేరిట రైతుల భూములను కాజేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రజల అభిప్రాయాలను వినాలని కోరారు. కొత్తగా ప్రతిపాదించిన 300 వార్డుల్లో విభజనలో కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనం దాగి ఉందని ఆరోపించారు. మేయర్ కాంగ్రెస్‌కు, డిప్యూటీ మేయర్ ఎంఐఎంకు వచ్చేలా నిర్ణయం తీసుకుందని ఆయన విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు

- గ్లోబల్ సమ్మిట్ విజయవంతం
- అవకతవకలు జరగకుండా చూడాలి : సిపిఐ నేత నారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వన తెలంగాణ ప్రభుత్వం, క్యాబినెట్ చురుకుగా పనిచేసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించిందని సిపిఐ సీనియర్ నేత, సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు ఆరు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్టు వార్తలు రావడం శుభపరిణామం అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే పారిశ్రామికాభివృద్ధిని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.



ఎయు యాజమాన్యానికి చెక్కును అందజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యికోట్లు

- ప్రపంచస్థాయి వర్సిటీగా అభివృద్ధి చేస్తాం
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో కులం గోడల్ని బద్దలు కొడతాం
- అధ్యాపక పోస్టుల భర్తీకి సెర్చ్ కమిటీ నియమించుకోండి : సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే ఆత్మగౌరవం దక్కుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ గుండెకాయ అయిన ఉస్మానియా యూనివర్సిటీని ప్రపంచస్థాయి వర్సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో తమ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తున్నదని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం వెయ్యి కోట్ల రూపాయలకు సంబంధించిన జిఒ కాపీతో ఇక్కడకు తిరిగి వచ్చానని తెలిపారు. వర్సిటీలో వెయ్యి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసుకునేందుకు సెర్చ్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, దానిలో రాజకీయ జోక్యం లేకుండా తాను చూస్తానని హామీనిచ్చారు. కులం అడ్డుగోడల్ని ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో బద్దలు కొడతామని మరోమారు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో సభను నిర్వహించారు. అందులో ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్‌పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను సిఎం విడుదల చేశారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా తుది మాస్టర్ ప్లాన్, డిజైన్లను ఖరారు చేయనున్నట్టు సిఎం ప్రకటించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఒయుకు వెళ్తానంటే విద్యార్థులు అడ్డుకుంటారని, వెళ్లొద్దని చాలా మంది సూచించారని తెలిపారు. తాను మాత్రం ధైర్యం కాదు అభిమానం ఉంటే చాలనీ, వర్సిటీలోని యువమిత్రుల అభిమానంతో ఒయు భవిష్యత్తు ప్రణాళికలు రచించేందుకు ఇక్కడకు వచ్చానని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పివి నర్సింహారావు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, జార్జిరెడ్డి, ప్రజాయుద్ధనౌక గద్దర్ లాంటి మేధావులను అందించిన చరిత్ర ఒయదేనని గుర్తుచేశారు. తాను గుంటూరులో చదువుకోలేదనీ, సర్కారుబడిలో చదువుకున్నాను కాబట్టి గూడుపుఠాణీలు తెల్వదని సిఎం చెప్పారు. ఇంగ్లీష్ రావట్లేదనే బెంగ పెట్టుకోవద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రెండేళ్లలో చేసింది ఇదే..

ఆసుకవి రచించిన జయ జయమే తెలంగాణ గీతాన్ని గత పాలకులు తొక్కిపెడితే తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర గీతంగా గుర్తించామని రేవంత్‌రెడ్డి చెప్పారు. బహుజన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకుని జాతికి అంకితం చేశామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ అమలు చేసి సామాజిక న్యాయం చేశామన్నారు. వందేళ్లుగా బయటకు తీయని బిసి లెక్కలను తేల్చేందుకు కులగణన చేశామని చెప్పారు. వందల ఎకరాల్లో ఫామ్ హౌసులు కట్టుకున్నోళ్లు పదేళ్లలో దళితులకు మూడెకరాల భూమిని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లు అవుతున్నా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల పేరిట వేర్వేరు హాస్టళ్లు పెట్టి ఆ పిల్లలను అక్కడే చదివిస్తే వారి ఆలోచనలు ఎలా మారుతాయి? వివక్ష ఎలా పోతుంది? అని ప్రశ్నించారు. కులం అడ్డుగోడల్ని బద్దలు కొట్టేందుకు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఆ పాఠశాలల ద్వారా ఆయా సామాజిక తరగతులకు చెందిన దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు ఒకే చోట చదువుకునే అవకాశం ఏర్పడుతుందని, వివక్షను రూపుమాపేందుకు ఇది ఒక మార్గమని చెప్పారు. రెండేండ్లలో ఏం చేశారు అని ప్రశ్నిస్తున్నవారికి ఇవి కనిపించడం లేదా? అని నిలదీశారు. విద్యార్థుల్లో అవసరమైన నాలెడ్జ్‌ని, స్కిల్స్‌ను అందించేందుకు స్కిల్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అందులో ఒక డైరెక్టర్లుగా ఉన్న ఆనంద్ మహీంద్రా, దేవయ్యలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 2036 నాటికి ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్ సాధించాలనే లక్ష్యం పెట్టి చిన్నప్పటి నుంచే మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు.

రెండేళ్లలో ఒయు సమస్యల్ని పరిష్కరిస్తాం

కొందరు పదేళ్లుగా ఒయుని నిర్వీర్యం చేయాలని చూశారని విమర్శించారు. తాను మాత్రం రెండేండ్లలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సమస్యల్ని పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఒయూలోని వెయ్యి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

విద్యార్థి నేతల అరెస్టు

సిఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ముగించుకుని వెళ్తున్న సమయంలో కొంతమంది నిరుద్యోగ విద్యార్థులు 'సిఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం అటువైపు వెళుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను ప్రశ్నించారు. 'మీకు ఉద్యోగాలు వచ్చాయి..మాకు ఉద్యోగాలు ఎక్కడ ? జ్యాబ్ క్యాలెండర్ ఏమైంది?' అంటూ నిలదీశారు. పోటీ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్నా నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం వెళ్లాక కొంతసేపు సభా వేదిక ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సిఎం పర్యటన నేపథ్యంలో ఒయులోని బిఆర్ఎస్‌వి, ఎబివిపి, మాలమహానాడు అనుబంధ విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సిఎం పర్యటన అయిపోయిన తర్వాత వారిని పోలీసులు విడుదల చేశారు.

మహాలక్ష్మి పథకం విజయవంతం

- విజన్ 2047లో భాగంగా ప్రజా రవాణాను 70 శాతానికి పెంచాలి
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మహాలక్ష్మి పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవర్లు , కండక్టర్లు , శ్రామిక్ ఇతర సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. రవాణా శాఖ మంత్రిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్‌టిసి ఎండి, ఇడిలు సత్కరించారు. ఆర్‌టిసిని మరింత విస్తృత పర్చాలని, క్షేత్ర స్థాయిలో రాజధాని నుంచి గ్రామాల వరకు ఆర్‌టిసి కొత్త రూట్లను అన్వేషించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 డిపోల్లో ఉన్న ఆర్‌టిసి అధికారులు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందుకోసం ఇప్పటికే హైదరాబాద్ నగరంలో గత మూడు నెలలుగా సర్వే చేసి 373 కొత్త రూట్లలో బుధవారం నుంచి ఆర్‌టిసి బస్సులు నడిపిస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా రింగ్ రోడ్డు వెలుపల ఉన్న దాదాపు ఏడు లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు. కొత్త రూట్లలో బస్సులు నడిపినప్పుడే విజన్ 2047లో మన లక్ష్యాలకు అనుగుణంగా ఇప్పుడున్న 28 శాతం ప్రజా రవాణా ను 70 శాతానికి పెంచుకోవడానికి సాధ్యమవుతుందని సూచించారు. తమకు సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ప్రథమ కర్తవ్యమని చెప్పారు. ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ సిబ్బంది స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. అటు అధికారులు సైతం ఆర్టీసీ సిబ్బంది విషయంలో కఠినంగా కాకుండా కుటుంబ సభ్యుల మాదిరి వ్యవహరించాలని అప్పుడే వారు సంస్థ కోసం మరింత పనిచేస్తారని తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగుల మీద దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన ఘటనలో డ్రైవర్‌కి సంస్థ అండగా ఉందన్నారు. మీ ప్రతినిధిగా ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తున్నానని, ఆర్థిక పరమైన అంశాలు కూడా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని మంత్రి వివరించారు. గత పదేళ్లుగా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసి, సంస్థ ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహా లక్ష్మీ పథకం ద్వారా 90కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన డిపోలు కూడా లాభాల్లోకి వచ్చేలా పని చేయాలని సూచించారు. గతంలో 2011లో నియామకాలు జరిగితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు 3038 పోస్టులకు డ్రైవర్, శ్రామిక్, సూపర్ వైజర్ పోస్టులకు నియామకాలు జరుగుతున్నాయన్నారు. ,2014 తరువాత మళ్లీ తమ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో 2476 నూతన బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. అంటే ఇప్పుడున్న బస్సుల్లో 40 శాతం ఈ రెండు సంవత్సరాల కాలంలో వచ్చినవేనని, సంస్థలో కారుణ్య నియామకాలను బ్రెడ్ విన్నర్ స్కిం కింద 800, మెడికల్ అన్ ఫిట్ కింద 390 మంది మొత్తం 1190 మందిని నియమించామని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నూతనంగా పెద్దపల్లి ,ములుగు జిల్లా ఏటూరు నాగారంకు కొత్త డిపోలు ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో బస్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వచ్చే రెండేండ్లల్లో నగరంలో 2800 ఈవీ బస్సులు నడుస్తున్నాయన్నారు వీడియోకాన్ఫరెన్సులో ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, ఇడిలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణతో పేదలు ఉన్నత విద్యకు దూరం

- ఉన్నత విద్యపై రిపోర్ట్ విడుదల చేసిన సెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రయివేటీకరణతో పేదలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ (సెస్) ఆధ్వర్యంలో రిపోర్ట్‌ను ఉన్నత విద్యపై రిపోర్ట్‌ను సుఖ్ దేవ్ తోరట్ విడుదల చేశారు. ఈ సమావేశానికి కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ (న్యూఢిల్లీ) ప్రొఫెసర్ జంధ్యాల బిజి తిలక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా, సెస్ డైరెక్టర్ ఇ.రేవతి, అసోసియేట్ ప్రొఫెసర్ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుఖ్‌దేవ్ తోరట్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో పెరిగిపోతున్న అసమానతలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ అసమానతలకు ఆదాయం, సామాజిక వెనుకబాటు తనం, మతాలవారీగా కారణాలను విశ్లేషించాలని కోరారు. 16 ఏళ్ల వయస్సు వచ్చిన ఆడపిల్లలు ఎక్కువగా ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ అవుతున్నారని, దానిని నివారించే విధంగా ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ఉన్నత విద్యకు సంబంధించిన పాలసీల విషయంలో కేరళ రాష్ట్రం ఉత్తమమని కొనియాడారు. బోధనా సిబ్బంది ఖాళీలు, మౌలిక సదుపాయాల లేకపోవడం తదితర కారణాలతో ఉన్నత విద్య పట్ల ఆసక్తి ఉండటం లేదని తెలిపారు. శాంతాసిన్హా మాట్లాడుతూ విద్యలో ఎట్టి పరిస్థితిలో ప్రయివేటీకరణను ఆమోదించవద్దని సూచించారు. ప్రయివేటీకరణ పెరుగుదలే ఉన్నత విద్యలో నమోదు తగ్గుదలకు కారణమని చెప్పారు. రేవతి మాట్లాడుతూ రిపోర్ట్ ను తయారు చేసేందుకు ఐదేళ్లు పట్టిందని చెప్పారు. ఈ రిపోర్ట్ ఉన్న పరిస్థితిని చెప్పేందుకే ఉద్దేశించిందని వెల్లడించారు.

తెలంగాణ క్రీడారంగంలో నూతన అధ్యాయం

- జిఎంఆర్ స్పోర్ట్స్-ప్రభుత్వం మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
జిఎంఆర్ స్పోర్ట్స్ సంస్థ, తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 సందర్భంగా భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగింది. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ రైజింగ్ అజెండా కింద రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే తెలంగాణ ప్రభుత్వ భవిష్యత్తు దృక్పథానికి జీఎంఆర్ తమ సహకారాన్ని అందిస్తున్నది. దుబాయ్ స్పోర్ట్స్ సిటీని జ్ఞాన భాగస్వామ్య సంస్థగా చేసుకొని, జిఎంఆర్ స్పోర్ట్స్ భారత్ ఫ్యూచర్ సిటీలో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని అభివద్ధి చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌లో ఆధునిక శిక్షణా కేంద్రాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్త స్టేడియాలు, హై-పర్ఫార్మెన్స్, రిహాబిలిటేషన్ సెంటర్లు, స్పోర్ట్స్ సైన్స్ సదుపాయాలు వంటి అంతర్జాతీయ ప్రమాణాల వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రణాళిక తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ హబ్‌గా నిలబెట్టడమే లక్ష్యమని జిఎంఆర్ స్పోర్ట్స్ సంస్థ ప్రకటించింది.ఒప్పందం సందర్భంగా జిఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ జిఎంఆర్ స్పోర్ట్స్ చైర్మెన్ కిరణ్ కుమార్ గ్రంధి మాట్లాడుతూ "తెలంగాణ ప్రభుత్వంతో కలిసి శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని అభివృద్ధి చేయడం ద్వారా క్రీడా రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాము. ఈ కార్యక్రమం తెలంగాణను వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ క్రీడా కేంద్రంగా నిలబెడుతుంది" అని అన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డికి దశదిశ లేదు

- స్వేచ్ఛ ఇవ్వడమంటే నిరసన తెలిపే వారిని అరెస్టు చేయడమా?
- బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన మీద దిశదిశ లేదని బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. నిరసన తెలిపే వారికి స్వేచ్ఛ ఇస్తున్నామంటూనే బిఆర్ఎస్‌వి నేతలను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. పోలీసుల్లేకుండా ఓయూకు వస్తానని గతంలో చెప్పి ఇప్పుడు భారీ బందోబస్తుతో పోలీసు పహారా మధ్య హాజరు కావడమేంటని అడిగారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి మాటమీద నిలబడే అలవాటు లేనట్టుందని చెప్పారు. విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఓయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామంటూ రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఆ నిధులను ఏయే అభివృద్ధికి ఎలా వినియోగించుకోవాలో ప్రణాళిక లేదన్నారు. వర్సిటీ అధికారులే ఆలోచించి ఖర్చు చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వర్సిటీలో నీళు వస్తలేవనీ, పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. హాస్టళ్లు సరిపోవడం లేదనీ, మౌలిక వసతుల్లేవని అన్నారు. ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తిరగబడే రోజులొస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అభిలాష్ రంగినేని, దిలీప్‌రెడ్డి, నాగరాజు యాదవ్ శ్రీకాంత్ ముదిరాజ్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ తొలిదశ పోలింగ్‌కు 50 వేల మంది పోలీసులతో బందోబస్తు

- రూ.8 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులు స్వాధీనం
- రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో మూడు విడుతలుగా సాగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో నేడు నిర్వహించనున్న తొలి దశ పోలింగ్‌కు 50 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 3,800 గ్రామపంచాయతీలకు పోలింగ్ జరగనుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 537 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్న వివిధ వర్గాల నుంచి నగదు, ఇతర వినియోగ వస్తువులను భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నట్టు డిజిపి తెలిపారు. వాటి విలువ రూ.8.20 కోట్లని ఆయన తెలిపారు. 1000 మందికి పైగా అవాంఛనీయ సంఘటనలు సృష్టిస్తారనే వారిని బైండోవర్ చేశామని, ఆయుధ లైసెన్స్ కలిగిన వారి నుంచి ఆయుధాలను కూడా స్థానిక పోలీస్ స్టేషన్‌లలో డిపాజిట్ చేయించామని తెలిపా రు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ సంఘటనలకు సంబంధించి 218 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కూడా రంగంలో దించామని, ఎన్నికలు పూర్తయ్యేంత వరకు గస్తీ నిర్వహించ నున్నారని తెలిపారు. పోలింగ్‌కు అవాంతరాలు సృష్టించేవారు ఎవరైనా వదిలిపెట్టమని, ప్రజలు ప్రశాంతంగా పోలింగ్‌లో పాల్గొనాలని శివధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

10వ తరగతి పరీక్షల టైంటేబుల్‌ను వెంటనే సవరించాలి

- టిఎస్ యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షల షెడ్యూల్ అశాస్త్రీయంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) విమర్శించింది. ఈ మేరకు యూటీఎఫ్ అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఒక ప్రకటన విడుదల చేశారు. వెంటనే ఆ షెడ్యూల్‌ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. 35 రోజుల పరీక్షల నిర్వహణతో పదవ తరగతి విద్యార్థులకు ప్రయోజనం ఉండదని అభ్యంతరం తెలిపారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల, పాఠశాల ప్రయోజనాల కంటే అధికారులు తమ వ్యక్తిగత అభిప్రాయాన్ని రుద్దినట్టుగా టైంటేబుల్ ఉందని తప్పుపట్టారు. పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇస్తే సరిపోతుందని అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత షెడ్యూల్ లో నాలుగు నుంచి ఆరు రోజుల విరామం ఇవ్వడంతో విద్యార్థుల్లో ఆసక్తి తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ అధికారులు 6వ తరగతి నుంచి 9వ తరగతి గురించి కనీసస్థాయిలో దృష్టి పెట్టలేదని, 35 రోజులు కేవలం 10వ తరగతి పరీక్షల నిర్వహణలో ఉంటే ఇతర తరగతుల వార్షిక పరీక్షలను ఎవరు నిర్వహించాలని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ఇతర తరగతుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ పదవ తరగతికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే దోరణి పెంచడం సరికాదని చెప్పారు. కార్పోరేటు స్కూళ్లలాగా జిల్లాస్థాయి ర్యాంకుల కోసం పోటీ పడి పరీక్షల్లో జిల్లా అధికారులు జోక్యం చేసుకోవడం ద్వారా పరీక్షల వ్యవస్థ స్థాయి దిగజార్చుతున్నారని విమర్శించారు. ఇలాంటి దోరణితో గుణాత్మక ఫలితాల కంటే పరిమాణాత్మక ఫలితాలకు ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. దీంతో విద్యార్థులకు పరీక్షలంటే శ్రద్ధ తగ్గిందనీ, పరీక్షల పట్ల భయం పోగొట్టి ఆసక్తిని పెంచేలా విధానాలు రూపొందిచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

నోటీసు ఆర్డర్ 5 రూలు 1 ఆఫ్ సిపిసి
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారు :
కందుకూరు కోర్టు
I.A.No. 544 / 2023
O.S.No. 50 / 2024
మూలె బ్రహ్మయ్య - పిటిషనరు
వర్సెస్
మూలె సుబ్బారెడ్డి, అండ్ అదర్స్ - రెస్పాండెంట్స్
టు,
మనక్ చంద్ జైన్,
తండ్రి లేట్ జోధ్ రాజ్ జైన్, R/o ఫీల్ ఖానా, నెం. 15/1/472, హైదరాబాద్-12, తెలంగాణ రాష్ట్రం.
సార్,
పై నంబరు పిటిషన్‌లో మీరు 15వ రెస్పాండెంట్‌గా ఉన్నారు. పై కోర్టు నుండి అనేక సార్లు పిటిషనర్ మీకు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసివున్నారు. పై నంబరు దావాను తే07-01-2026ది న వాయిదా వేసివున్నారు. కావున ఆదినము ఉదయం గ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 07-01-2026
బి.సాయిశంకర్
సయ్యద్ సుల్తాన్ బాషా
అడ్వకేట్స్, కందుకూరు.

నోటీసు ఆర్డర్ 5 రూలు 1 ఆఫ్ సిపిసి
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారు :
కందుకూరు కోర్టు
O.S.No. 50 / 2022
మూలె బ్రహ్మయ్య - వాది
వర్సెస్
మూలె సుబ్బారెడ్డి, అండ్ అదర్స్ - ప్రతివాది
టు,
మనక్ చంద్ జైన్,
తండ్రి లేట్ జోధ్ రాజ్ జైన్, R/o ఫీల్ ఖానా, నెం. 15/1/472, హైదరాబాద్-12, తెలంగాణ రాష్ట్రం.
సార్,
పై నంబరు దావాలో మీరు 15వ ప్రతివాదిగా ఉన్నారు. పై కోర్టు నుండి అనేక సార్లు పిటిషనర్ మీకు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసివున్నారు. పై నంబరు దావాను తే07-01-2026ది న వాయిదా వేసివున్నారు. కావున ఆదినము ఉదయం గ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 07-01-2026
బి.సాయిశంకర్
సయ్యద్ సుల్తాన్ బాషా
అడ్వకేట్స్, కందుకూరు.

నోటీసు ఆర్డర్ 5 రూలు 1 ఆఫ్ సిపిసి
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారు :
కందుకూరు కోర్టు
I.A.No. 938 / 2022
O.S.No. 50 / 2022
మూలె బ్రహ్మయ్య - పిటిషనరు
వర్సెస్
మూలె సుబ్బారెడ్డి, అండ్ అదర్స్ - రెస్పాండెంట్స్
టు,
మనక్ చంద్ జైన్,
తండ్రి లేట్ జోధ్ రాజ్ జైన్, R/o ఫీల్ ఖానా, నెం. 15/1/472, హైదరాబాద్-12, తెలంగాణ రాష్ట్రం.
సార్,
పై నంబరు పిటిషన్‌లో మీరు 15వ రెస్పాండెంట్‌గా ఉన్నారు. పై కోర్టు నుండి అనేక సార్లు పిటిషనర్ మీకు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసివున్నారు. పై నంబరు దావాను తే07-01-2026ది న వాయిదా వేసివున్నారు. కావున ఆదినము ఉదయం గ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 07-01-2026
బి.సాయిశంకర్
సయ్యద్ సుల్తాన్ బాషా
అడ్వకేట్స్, కందుకూరు.

పాసులుంటేనే ఎంట్రీ

- 13న ఉప్పల్ స్టేడియంలో 'మెస్సి- గోట్ ఫుట్‌బాల్ మ్యాచ్'
- రాచకొండ సిపి సుధీర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో 'మెస్సి- గోట్ ఫుట్ బాల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాచకొండ సిపి సుధీర్‌బాబు తెలిపారు. బుధవారం రాచకొండ కమిషనరేట్ ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మెస్సి జట్ల మధ్య జరగబోయే 'మెస్సి- గోట్ ఫుట్‌బాల్ మ్యాచ్'కు భారీగా క్రీడా అభిమానులు తరలివచ్చే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోవుంటాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సిపి తెలిపారు. టికెట్, పాసులు ఉన్న వారు మాత్రమే స్టేడియం వద్దకు రావాలని, అవి లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని చెప్పారు. ఇందుకు నగరవాసులు, అభిమానులు సహకరించాలని సిపి కోరారు.

మైనర్ బాలికపై లైంగికదాడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఓ బాలికపై నలుగురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన 13 ఏండ్ల బాలిక ఈనెల 4న ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. అదే రోజు తన కూతురు కనబడటం లేదంటూ సంగారెడ్డి పోలీసు స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టినట్టు పట్టణ సిఐ రామునాయుడు తెలిపారు. కాగా ఈ నెల 8వ తేదీన సికింద్రాబాద్‌లో ఉండగా నలుగురు యువకులు బాలిక వద్దకు వచ్చి ఆమెతో మాట్లాడి తాము లాడ్జిలో ఉంటున్నామని తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. దర్యాప్తు సందర్భంగా విషయం తెలుసుకున్న పోలీసులు బాలికపై జరిగిన దాడికి గుర్తించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ తెలిపారు.

కారు బోల్తా

ి ముగ్గురి మృతి

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని తర్నం గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించి సిఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్ నగర్‌కు చెందిన షేక్ మోహిన్ (26), కందం కీర్తిసాగర్ (29), చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ మోహినుద్దీన్ (27) కోటేకర్ యోగేష్ బేలలో మేస్త్రీ పనులు ముగించుకొని కారులో తిరిగి ఆదిలాబాద్‌కు బయలుదేరారు. తర్నం మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడడంతో షేక్ మోహినుద్దీన్, షేక్ మోహిన్, కందం కీర్తిసాగర్ అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. యోగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ఆయన స్నేహితులకు ఫోన్ చేసి ప్రమాదం గురించి తెలియజేశారు. వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకొని గాయపడిన యోగేష్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. జైనథ్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. నుజ్జునుజ్జయిన కారులో ఉన్న మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదానికి అతివేగమే కారణమని భావిస్తున్నారు.కీర్తి సాగర్‌కు 40 రోజుల కిందటే పెళ్లి జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న రిమ్స్ ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించారు. గాయపడిన యోగేష్‌ను పరామర్శించి వైద్యం, ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ 'ఫస్ట్ వావ్ బ్లాక్' క్రెడిట్ కార్డ్

ముంబయి : ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కొత్తగా ఫస్ట్ వావ్ బ్లాక్ క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. ఈ కార్డు అంతర్జాతీయ లావాదేవీలపై ఎలాంటి అదనపు రుసుములు ఉండవని తెలిపింది. ఇది రూపే నెట్‌వర్క్‌పై పనిచేసే వర్చువల్ కార్డ్‌తో వస్తుందని.. దీనిని నేరుగా యుపిఐ చెల్లింపుల కోసం వాడుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది. రూ.20,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉన్న ఎవరైనా ఈ కార్డును సులభంగా పొందవచ్చని పేర్కొంది. రూ.2 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద కవర్ లభిస్తుందని తెలిపింది.

సామ్‌సంగ్, ఇన్‌స్టామార్ట్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ భారతదేశపు ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టామార్ట్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రధాన నగరాల్లో గెలాక్సీ ఉత్పత్తులను తక్షణమే అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. తమ అత్యంత ఆదరణ పొందిన పరికరాలను వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని ఎంఎక్స్ బిజినెస్ డైరెక్టర్ రాహుల్ పహ్వా తెలిపారు.

వివక్షలేని సమాజం కావాలి

- మహిళలకు భద్రత కల్పించాలి : మల్లు లక్ష్మి
- మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గౌరవంగా జీవించే హక్కు, గౌరవప్రదమైన ఉపాధి, ఉద్యోగం, వివక్ష లేని సమాజం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. అలాగే, మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ విఎస్‌టి నుంచి బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా పుట్టుకతోనే ప్రతి వ్యక్తికీ కొన్ని హక్కులు లభిస్తాయని తెలిపారు. అయితే, వాటిని పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని, కానీ ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్త మానవళి జాతి, కులం, మతం, ప్రాంతం, లింగం పేరుతో వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో, సమాన హక్కులతో జీవించాలన్నది ఐక్యరాజ్యసమితి ఆశయమని చెప్పారు. అందుకు భిన్నంగా దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి జరుగుతోందన్నారు. హక్కుల కోసం ఉద్యమిస్తున్న సామాజిక కార్యకర్తలపై దాడి చేసి చంపుతున్నారన్నారు.

ర్యాలీ చేస్తున్న మహిళలు

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడుతూ.. దేశంలో ఇంకా లింగ వివక్ష కొనసాగుతోందని, మహిళల పట్ల హింస అనేక రూపాల్లో జరుగుతోందని అన్నారు. అసమానతలు, హింస, మద్యం, డ్రగ్స్ లేని సమాజం, రక్త హీనత రహిత భారతదేశం కావాలన్నారు. మహిళల హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం వినోద, పి శశికళ, వై వరలక్ష్మి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా ప్రజలకు ఆ ఫలాలు అందకపోవడం బాధాకరమన్నారు. చిన్నపిల్లలపైనా, మహిళలపైనా లైంగిక దాడులు, హత్యలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని చెప్పారు. విద్య, వైద్యం ప్రభుత్వ అధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మమ్మ, పద్మ, స్వర్ణలత, షబానా బేగం, మంగ, విమల, కవిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ

- బిఆర్ఎస్ కార్యకర్త మృతి
- గ్రామంలో ఉద్రిక్తత.. పోలీసు బందోబస్తు
- సూర్యపేట జిల్లా నూతనకల్ మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి బిఆర్ఎస్ కార్యకర్త మృతిచెందాడు. పలువురికి గాయాలయ్యాయి. గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు భారీగా మోహరించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

లింగంపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఎస్‌సి రిజర్వేషన్ అయింది. బిఆర్ఎస్ అభ్యర్థిగా మాదాసు వెంకన్న పోటీలో ఉన్నాడు. కాంగ్రెస్ అభ్యర్థిగా దేశపంగు మురళి పోటీలో ఉన్నాడు. అయితే, బిఆర్ఎస్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎలాగైనా బిఆర్ఎస్ గెలుపును అడ్డుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రచారం ముగియడంతో ఓట్ల సందర్భంగా వ్యవహరించాల్సిన విధానాలపై చర్చించేందుకు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్న మల్లయ్యయాదవ్, ఉప్పుల మల్లయ్య (57), మున్న లింగయ్య మరికొంత మంది కలుసుకున్నారు. దాంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉప్పుల సతీష్, కొరివి గంగయ్యతోపాటు మరికొంత మంది అక్కడికి చేరుకొని బిఆర్ఎస్ నాయకులను అడ్డుకుని.. వెంట తెచ్చుకున్న రాళ్లు, కర్రలతో దాడి చేశారు. మున్న మల్లయ్యపై దాడి చేస్తుండగా అడ్డుకున్న ఉప్పుల మల్లయ్య తలపై కర్రలతో కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అయినా వదలకుండా రాయితో తలపై గట్టిగా కొట్టడంతో మెదడు చితికింది. దాడిలో ఇరు పార్టీల వారికి గాయాలయ్యాయి. అక్కడ ఉన్న కొంతమంది 100కు ఫోన్ చేయడంతో పోలీసులు గ్రామానికి చేరుకోవడంతో పరారయ్యారు. మల్లయ్యను వెంటనే సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మల్లయ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మల్లయ్య మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గ్రామాన్ని ఎఎస్‌పి రంగారెడ్డి, డిఎస్‌పి ప్రసన్న కుమార్, సిఐ నర్సింహారావు సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్త్ ఏర్పాటు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మల్లయ్య మృతదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉప్పల మల్లయ్య మృతదేహాన్ని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ గుండాల అరాచకాలు భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. తుంగతుర్తిలో రౌడీయిజం పెరుగుతోందని తాము పలుమార్లు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు యథేచ్ఛగా బెదిరింపులు, దాడులకు పాల్పడుతూ రాజకీయ హత్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట బిఆర్ఎస్ జిల్లా కార్యదర్శి బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న కవిత

రెండ్రోజుల్లో మాధవరం అవినీతి బహిర్గతం చేస్తాం

- జాగృతి జన బాటలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నాం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అవినీతి, అక్రమాలను రెండ్రోజుల్లో ఆధారాలతో బహిర్గతం చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా బుధవారం ఆమె హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ నియోజకవర్గంలో పర్యటించారు. బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కొంతసేపు గడిపారు. అనంతరం రామన్నకుంట చెరువు వద్ద మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులతో కవిత మాట్లాడుతూ.. జనంబాటలో భాగంగా విద్య, వైద్య రంగాల్లో సమస్యలపై దృష్టి పెట్టామని తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామని, ఇళ్లు, ఇళ్ల పట్టాలు లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామని అన్నారు. తమ వరకు చేయగలిగేది తాము ఒక సంస్థగా చేస్తామని తెలిపారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు.

ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే మాధవరం చేసిన ఆరోపణలపై విలేకరులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. మాధవరం చేసిన అవినీతి అక్రమాలపై రెండ్రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆధారాలతో పూర్తి వివరాలు, సమాధానం ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం మాధవరం మాటల్లో ఫ్రస్టేషన్ కనిపిస్తోందని, ఆయన 15 ఏళ్లుగా చేసిందే తాను చెప్పానని అన్నారు. మాధవరం వ్యక్తిగత ఆరోపణలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. బిఆర్ఎస్‌లో తనను నిజామాబాద్ వరకే పరిమితం చేశారని, ఇప్పుడు జాగృతి అధ్యక్షులుగా జనం బాటలో భాగంగా ప్రతి నియోజకవర్గం తిరుగుతున్నానని అన్నారు.

మానవ హక్కుల కోసం ప్రతీ ఒక్కరు ఉద్యమించాలి

- ప్రొఫెసర్ కొదండ రామ్

ప్రజాశక్తి- కల్చరల్

మానవ హక్కులను కాపాడితే సమాజం పరిఢవిల్లుతుందని తెలంగాణ జనసమితి అధినేత, ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. బుధవారం శ్రీత్యాగరాయ గానసభలో జాతీయ మానవహక్కుల సంఘం, సామాజిక న్యాయ సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సభ జరిగింది. కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుక్క డానియల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మానవహక్కుల కోసం నిలబడితే సమాజ మార్పుకు సంకేతంగా నిలుస్తుందని, ఆ రోజులో యేసుక్రీస్తు, కృష్ణభగవానుడు ఏ విధంగానైతే మార్గనిర్దేశనం చేశారో అంతే కీలకమైన మార్గనిర్దేశనం చేసినవారవుతారని అన్నారు. మానవహక్కుల కోసం కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు కలసి ఉద్యమించాలి అన్నారు. వాటి ఆధారంగా, ప్రతి మనిషి ప్రక్కవాడిని గౌరవించగల నూతన సమాజాన్ని నిర్మించుకుందామన్నారు. మనదేశంలో మానవహక్కుల కోసం పోరాటం చేయడమంటే ఇతరుల స్వేచ్ఛ కోసం కొట్లాడం కాకుండా మనల్ని మనం మార్చుకోవడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. మనుషులుగా జీవించి ఉంటే

సమాజం అభివద్ధిపథంలో ముందుకుకు సాగుతుందన్నారు. ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కాపాడటానికి ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో కమిషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్ రాయ్, జాతీయ ఉపాధ్యక్షుడు (ప్రజా అవగాహన) దీపక్ శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు సర్వేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు మాధవ్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీ , రాష్ట్ర కార్యదర్శి శైలేంద్ర సింగ్, వైస్ చైర్మన్ విసిఎన్ అశోక్, ఉపాధ్యక్షుడు షేక్ మన్సూర్ షా, షరీఫ్ అహ్మద్, ఖాసీం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంఘసేవకులకు , వికలాంకులకు పురస్కారాలు ప్రధానం చేశారు.

'విత్తనచట్టంలో సవరణలు చేయాలి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విత్తన చట్టం -2025 ముసాయిదాలో సవరణలు చేయాలని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి కోరారు. విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్ష, సమావేశాలు నిర్వహించామన్నారు. వివిధ పార్టీల నేతలు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు సంఘాల నేతలు, వ్యవసాయరంగ నిపుణులు, రిటైర్డ్ అధికారుల అభిప్రాయలు స్వీకరించి నివేదికను రూపొందించామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పలు సవరణలు ప్రతిపాదించామనీ, అదే సమయంలో ప్రస్తుత ముసాయిదాలో ఉన్న లొసుగుల్ని కూడ కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నామని వివరించారు. ఈ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నామన్నారు. బహుళజాతి విత్తన కంపెనీలకోసం ప్రత్యేకంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడలతో స్నేహభావం : సిజిఎం మురుగన్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డి టోర్నమెంట్ 2025-26 హైదరాబాద్‌లో జరుగుతోంది. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం ఈ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అధికారులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా కార్పొరేట్ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) పొన్నంబలం మురుగన్ విచ్చేశారు. వారితో పాటు జనరల్ మేనేజర్లు రవికుమార్ వర్మ, సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియదర్శి పంకజ్, ఎఐఎస్‌బిఐఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీ కె చంద్రశేఖర్, ఎస్‌బిఐఒఎ హైదరాబాద్ సర్కిల్ ప్రెసిడెంట్ హెచ్ శంకర్, ఎస్‌బిఐఒఎ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కె అంజనేయ ప్రసాద్, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కెఎస్ శాండిల్యా, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా మొదలయ్యిందని నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగులలో శారీరక దృఢత్వం, జట్టు స్ఫూర్తి, స్నేహభావాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పొన్నంబలం మురుగన్ పేర్కొన్నారు. క్రీడాకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నిజమైన క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఫోటో సెషన్ నిర్వహించారు. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ హైదరాబాద్ సర్కిల్ మరియు కోల్‌కతా సర్కిల్ జట్ల మధ్య జరిగింది. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో కోల్‌కతా జట్టుపై హైదరాబాద్ సర్కిల్ జట్టు ఘన విజయం సాధించింది.

కిర్బీ కార్మికుల బస్సుకు ప్రమాదం

- 32 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, చుక్క రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులతో వెళ్తున్న ఓ బస్సు.. మంచు వల్ల దారి కమ్మేయడంతో ముందున్న ట్రాలీ లారీని ఢీకొట్టింది. దాంతో ఆ బస్సులోని 32మంది కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న కిర్బీ పరిశ్రమకు చెందిన కార్మికులు బుధవారం ఉదయం ఇంద్రేశం మున్సిపాలిటీలోని పిఎన్ఆర్ కాలనీ నుంచి మొదటి షిఫ్ట్‌కు కంపెనీ బస్సులో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉదయం ఐదున్నర గంటల సమయంలో కర్దనూర్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి పాశమైలారం వెళ్లే రోడ్డు మార్గంలో పొగమంచు కమ్మి వేయడంతో ముందు వెళ్తున్న ట్రాలీ లారీని బస్సు ఢీకొట్టింది. దాంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమయింది. అందులో ఉన్న 32 మంది కార్మికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే పటాన్‌చెరులోని అమేధా హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు హుటాహుటిన హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. ప్రమాద వివరాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో, పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన వైద్య సదుపాయాలు లేకపోతే ఇతర హాస్పిటల్‌కు తీసుకుపోయి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. అధైర్యపడొద్దని, సిఐటియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిందని తెలవగానే కిర్బీ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వీఎస్ రాజు, నాయకులు తలారి శ్రీనివాస్, నాగప్రసాద్.. కార్మికులను అంబులెన్స్‌లో హాస్పిటల్స్‌కు తీసుకువచ్చే ఏర్పాట్లు చేసి.. పూర్తిస్థాయిలో వైద్యం అందే విధంగా పర్యవేక్షణ చేశారు. ఐదు మంది కార్మికులను ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచగా, మిగతా కార్మికులకు వైద్యం అందించి ఎటువంటి ఇబ్బంది లేదని డాక్టర్లు డిశ్చార్జ్ చేశారు. చుక్క రాములుతోపాటు యాజమాన్యం ప్రతినిధులు ఫిల్ఫోస్, రాజమహేందర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అతిమేల మాణిక్, సిఐటియు జిల్లా కోశాధికారి కె రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు, పి పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే గూడెం..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కిర్బీ పరిశ్రమ కార్మికులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులను ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో చర్చించి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రస్తుతం గాయపడిన కార్మికులందరూ క్షేమంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే వెంట ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు అంతి రెడ్డి, శివారెడ్డి, బండి శంకర్ తదితరులు ఉన్నారు.

సుమధుర గ్రూప్ రూ.600 కోట్ల పెట్టుబడి

- ఇండస్ట్రీయల్ పార్క్ అభివృద్ధికి ప్రభుత్వంతో ఒప్పందం

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒకటైన సుమధుర గ్రూప్ రాష్ట్రంలో రూ.600 కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చింది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025లో తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. సుమధుర గ్రూప్ వచ్చే రెండు సంవత్సరాల్లో రూ.600 కోట్లు పెట్టుబడిగా పెట్టి 100 ఎకరాల గ్రేడ్ ఏం ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. ఈ పార్క్‌ను గ్లోబల్ తయారీ సంస్థలను ఆకర్షించేలా, ప్రాంతీయ పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసేలా రూపకల్పన చేశారు. ఏరోస్పేస్, ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్, ఇ-కామర్స్ రంగాలకు ప్లగ్-అండ్-ప్లే సదుపాయాలు కల్పించే ఈ పార్క్, తదుపరి రెండేళ్లలో దాదాపు 8,000 ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను సృష్టించనుందని ఆ సంస్థ వైస్ చైర్మన్ రామారావు కలకుంట్ల తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలకు మద్దతుగా, ఈ పెట్టుబడి ఉన్నత విలువ గల పరిశ్రమలను ఆకర్షించి, వేలాది ఉద్యోగాలను సృష్టించి.. గణనీయమైన ఆర్థిక ప్రభావాన్ని తేవాలని నిర్దేశించుకున్నామన్నారు.

నేటి నుంచి హెచ్‌ఆర్ఎస్ అలుగ్లేజ్ పబ్లిక్ ఇష్యూ

ముంబయి : అల్యూమినియం తయారీదారు హెచ్‌ఆర్ఎస్ అలుగ్లేజ్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) డిసెంబర్ 11 నుంచి ప్రారంభం కానుందన్నారు. ఈ ఇష్యూలో రూ.50.92 కోట్ల వరకు నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆ కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 53.04 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరుకు రూ. 94-96 ధరల బ్యాండ్‌లో జారీ చేయాలని నిర్ణయించింది. ఈ షేర్లు బిఎస్ఇ ఎస్ఎంఇ వేదికలో లిస్టింగ్ కానున్నాయని ఆ సంస్థ తెలిపింది. వ్యక్తిగత పెట్టుబడిదారులకు కనీస దరఖాస్తు 2,400 షేర్లుగా నిర్ణయించడంతో ఒక్కో షేరుకు రూ.96 ఆఫర్ ధర (హై ప్రైస్ బ్యాండ్) వద్ద కనీస పెట్టుబడి రూ.2,30,400గా లాట్‌సైజ్‌ను ప్రకటించింది.

గ్లోబల్ సమ్మిట్ అట్టర్‌ఫ్లాప్

పెట్టుబడులపై కట్టుకథలు : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్-2047 పేరుతో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. పెట్టుబడులపై కట్టుకథలు చెప్పి గ్లోబల్ సమ్మిట్‌కు రూ.కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదని, దాన్ని చేరుకునే మిషన్ లేదనీ, అది విజన్ డాక్యుమెంట్ కాదనీ, 'విజన్ లెస్' డాక్యుమెంట్ అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను కొల్లగొడుతున్న చోర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ ఒప్పందాల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవని తెలిపారు. రెండేళ్లుగా రూ.కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని రూ.కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు స్థాపించబడ్డాయి, ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయో దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ బ్లెయిర్, దువ్వూరి సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని తెలిపారు. అది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదనీ, భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో లాగా ఉందని ఆరోపించారు. రెండేండ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి రేవంత్‌రెడ్డి చేసిన పబ్లిసిటీ స్టంట్ గ్లోబల్ సమ్మిట్ అని తెలిపారు. 18 రాష్ట్రాల సీఎంలు, ఐదు వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తరని ప్రకటించారని, మంత్రులు పోయి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలను అందించారని గుర్తు చేశారు. కనీసం ఒక్క ముఖ్యమంత్రి రాలేదని, ఐదు వేల మంది విదేశీ ప్రతినిధుల్లో ఎక్కువ మంది రాలేదని తెలిపారు. ఎఐసిసి నేతలు కూడా రాలేదని, ఒక్క డీకే శివకుమార్ తప్ప కాంగ్రెస్ ఎంపిలు కూడా రాలేదని పేర్కొన్నారు. అది గ్లోబల్ సమ్మిట్ కాదని, లోకల్ సమ్మిట్ అని అట్టర్‌ఫ్లాప్ పొలిటికల్ షో అని తెలిపారు. ఫార్మా సిటీ పక్కన ఉన్న భూములు ముందుగానే సిఎం బినామీలతో కొనిపించి లే అవుట్లు చేసి రెడీగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు అక్కడ గ్లోబల్ సమ్మిట్ అని పెట్టి ఆ భూములను తెగనమ్మడానికి ప్రణాళిక వేశారని తెలిపారు.